పిలిచిన పలికే చిత్తూరు గంగమ్మ

- చిత్తూరు జాతరకు ఘన చరిత్ర
- కంటికి రెప్పలా కాపాడే తల్లిగా భక్తుల విశ్వాసం
- మంగళ, బుధవారాల్లో గంగజాతర
- పోటెత్తనున్న భక్తులు

చిత్తూరు గంగ జాతరకు ప్రత్యేకత ఉంది. ఇక్కడ కొలువైన గంగమ్మ భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. అమ్మవారిని కొలిచినంత మాత్రాన సమస్యలు తీరిపోయి సుఖశాంతులు కలుగుతాయని భక్తుల విశ్వాసం. కోర్కెలు తీరిన భక్తులు జాతరకొచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఇక్కడికి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తారు. మూడున్నర దశాబ్దాల క్రితం ఆవిర్భవించిన ఈ జాతర ఓ ప్రత్యేకతను సంతరించుకుంటోంది. మంగళ, బుధవారాల్లో గంగజాతరను ఘనంగా జరుపుకోనున్నారు.

–చిత్తూరు రూరల్(కాణిపాకం)



గంగమ్మ (ఫైల్)

చిత్తూరు నగరం ఒకప్పుడు మారుమూల గ్రామం. దాదాపు 350 ఏళ్ల క్రితం ప్లేగు వంటి ప్రాణాంతక వ్యాధులు విజృంభించాయి. ప్రతి ఇల్లూ ప్లేగుతో మంచానపడింది. ఊరు జనమంతా వణికిపోయారు. అలాగే కలరా, మసూచి, క్షయ వ్యాధులు సైతం ప్రబలడంతో ప్రజలు విలవిలలాడారు. చైత్ర మాసంలో వర్షాలు కరువయ్యాయి. చినుకు జాడ లేదు. తాగడానికి నీళ్లు లేక జనం అల్లాడిపోతున్నారు. ఈ క్రమంలో అప్పటి గ్రామ పెద్దలు ఊరుకు చెడు జరిగిందని భావించి ఏకమయ్యారు. అమ్మోరు ఆగ్రహించిందని ఊరంతా పసుపు నీరు చల్లి.. ఎల్లలో వేపకు తోరణాలు కట్టారు. గంగమ్మ అనుగ్రహం కోసం ఊరు నడివీధిలో మట్టితో చేసిన గంగమ్మ ప్రతిమ, రాళ్లను పెట్టి కొలవడం ప్రారంభించారు. అమ్మకు ఇష్టమైన పదార్థాలు, అంబలితో పాటు కుంభం పోసి బలిదానాలు ఇచ్చారు. ఫలితంగా అమ్మవారు శాంతించి వ్యాధులు తగ్గుముఖం పట్టడంతోపాటు సమృద్ధిగా వర్షాలు కురిశాయి. దీంతో ప్రజలకు అమ్మవారిపై అపారమైన నమ్మకం ఏర్పడింది. అప్పటి నుంచి గంగమ్మ కటాక్షం కోసం ఏటా జాతర నిర్వహిస్తున్నారు. కాలక్రమేణా ఊరు పట్టణంగా మార్పు చెందుతూ వాడవాడలా జాతరలు చేస్తున్నారని, ఆనవాయితీగా వస్తున్న ఈ జాతరకు ఇప్పటి వరకు మూడున్నర దశాబ్దాలు పూర్తయిందంటూ పెద్దలు చెబుతున్నారు.

పూర్వీకుల తరహాలోనే...

ఇప్పుడు కూడా చిత్తూరు గంగ జాతర జరగాలంటే ముందు నిర్వాహకులు ఒక్కటై నిర్ణయం తీసుకుంటారు. ఆపై నిర్ణయించుకున్న తేదీకి ముందు వచ్చే మంగళవారం చాటింపు వేస్తారు. చాటింపునకు ముందు ఎల్ల దేవతల అనుమతి కోరతారు. అక్కడ పూజలు చేసి గ్రామానికి ఎలాంటి దుష్ట శక్తులు రాకుండా ఊరుకు నలుదిక్కుల వేపాకులతో తోరణాలు కడతారు. దీంతో బయట ఉన్న జనం కూడా చిత్తూరుకు చేరుకుంటారు. ఇక్కడ జనం బయటకు వెళ్లకూడదని చెబుతుంటారు. అలాగే చాటింపు తరువాత మంచి ముహూర్తంలో గ్రామ దేవతకు పొంగళ్లు పెట్టి అమ్మవారి అనుమతితో పాటు శాంతిపూజలు చేస్తారు. ఈ పూజలు చేసిన తరువాతే చిత్తూరు నడివీధిలో గంగమ్మను ప్రతిష్టిస్తారు. ఆ తరువాత వచ్చే మంగళవారం ఉదయం అమ్మవారిని కొలువుదీర్చి తెర తొలగిస్తారు. ఆపై అమ్మవారికి భక్తులు ఉదయం అంబలి, రాత్రికి కుంభం పోసి దుష్టశక్తులు రాకుండా పూజలు చేస్తారు. మరుసటి రోజు సంప్రదాయబద్ధంగా జలధికి తరలిస్తారు. ఇలా కొన్నేళ్లుగా చిత్తూరులో గంగజాతర అంగరంగ వైభవంగా నడుస్తోంది. దీంతో పాటు కొంగారెడ్డిపల్లి, కట్టమంచి, గిరింపేట, దొడ్డిపల్లి, సంతపేట తదితర ప్రాంతాల్లో కూడా జాతర అట్టహాసంగా జరిపిస్తారు.

జాతరకు అశేష జనం...

చిత్తూరు నడివీధితో పాటు కొంగారెడ్డిపల్లి, సంతపేట, దొడ్డిపల్లి, మురకంబట్టు, ఓబనపల్లి, గిరింపేట తదితర ప్రాంతాల్లో గంగజాతరను ఘనంగా జరుపుకుంటారు. రెండు రోజులపాటు జరిగే ఈ జాతరకు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు అశేష సంఖ్యలో తరలివస్తారు. దీంతో ఆయా మండపాలు ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీగా కనిపిస్తాయి. విశేష పూజలు జరుగుతాయి. భక్తులను రద్దీ దృష్ట్యా జాతర పెద్దలు ఇప్పటికే ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశారు.



అంబలి పోస్తున్న భక్తులు

నడివీధిలో అఖండ జ్యోతి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గంగజాతర అంటే తొలుత అందరికీ చాటింపు మాత్రమే గుర్తుకొస్తోంది. చిత్తూరు నగరంలోని నడివీధిలో గంగమ్మను ప్రతిష్టించే చోట చాటింపు రోజు ఓ దీపం వెలిగిస్తారు. ఆ దీపం నిత్యం కాంతిమయమై వెలుగొందుతూ ఉంటుంది. ఈ దీపాన్ని అఖండ జ్యోతిగా పిలుస్తారు. ఆ దీపానికి ప్రత్యేక పూజలు చేసి ప్రాణ ప్రతిష్ట చేస్తారు. దీపం పరబ్రహ్మస్వరూపిణిగా భావించి బలిదానలతో ఉగ్రరూపాన్ని పోస్తారు. జాతర ముగింపు వరకు ఈ దీపం ఆరనీయకుండా జాతర నిర్వాహకులు భద్రంగా చూసుకుంటారు.



నడివీధిలో ఏర్పాటు చేసిన దీపం

అమ్మవారిని నిమజ్జనం చేసిన తర్వాతనే అఖండ జ్యోతిని కొండెక్కిస్తారని పెద్దలు అంటున్నారు.

సంతపేట జాతరను విజయవంతం చేయండి

చిత్తూరు రూరల్(కాణిపాకం): సంతపేట గంగజాతరను విజయవంతం చేయాలని జాతర కమిటీ చైర్మన్ భూపేష్ గోపీనాథ్ పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం చిత్తూరు నగరంలోని తన నివాసంలో గంగజాతర పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మంగళ, బుధవారాల్లో సంతపేట జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం వేకువజామున 3 గంటలకు శిరస్సు ఊరేగింపు ఉంటుందన్నారు. ఉదయం 7 గంటలకు తొలిపూజ, అంబలి పోసే కార్యక్రమం చేపడతామని చెప్పారు. మధ్యాహ్నం అన్నదానం, 3 గంటలకు కుంభ భోజన సమర్పణ, సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి నిమజ్జన కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ రెండు రోజల జాతరలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈసమావేశంలో చంద్ర, నందగోపాల్, నారాయణ, కిషోర్, అప్పాజి, చిట్టి, శివ, దేవా, కుప్పా, ప్రకాష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ భూపేష్ గోపీనాథ్

ఘనంగా జాతర పొంగళ్లు

చిత్తూరు రూరల్: ఈనెల 16, 17 తేదీల్లో జరిగే గంగజాతరను పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని పలు ఆలయాల వద్ద ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పొంగళ్లు పెట్టారు. పొన్నియమ్మ, దుర్గమ్మ, ముత్యాలమ్మ ఆలయాల వద్దకు భక్తులు పొంగళ్లు పెట్టేందుకు తరలివచ్చారు. మహిళలు ఆలయ ఆవరణం, రోడ్డుకు ఇరువైపులా క్యూపద్ధతిలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం వరకు ఆలయం రద్దీగా కనిపించింది. ఆలయ ఆవరణంలో కొలువుదీర్చిన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు.

క్లుప్తంగా

మండల సర్వసభ్య సమావేశం రేపు

తవణంపల్లె: మంగళవారం ఉదయం 10.30 గంటలకు తవణంపల్లె మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, తప్పక పాల్గొనాలని ఆయన కోరారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

బంగారుపాళెం: మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న కారణంగా సర్వసభ్య సమావేశాన్ని ఎన్నికల నియమ నిబంధనల మేరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

భగవద్గీత సారాంశం తెలుసుకోవాలి



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

బంగారుపాళెం: సర్వమతాలకు దేవుడు ఒక్కడేనని తెలియజేసే భగవద్గీత గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదివి, అందులోని సారాంశాలను తెలుసుకోవాలని త్రైతసిద్ధాంత–ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక బంగారుపాళెం కమిటీ–2 అధ్యక్షుడు ధనంజయ అన్నారు. ఆదివారం గుండ్లకట్టమంచి గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై కమిటీ సభ్యులు ప్రచారం చేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆభరణాల ప్రదర్శన



ఆభరణాలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): నడివీధి గంగజాతరను జయప్రదం చేయాలని జాతర వంశపారంపర్య ధర్మకర్త సీకేబాబు కోరారు. ఆయన ఆదివారం చిత్తూరు నగరం బజారువీధిలోని గీతా మందిరంలో గంగమ్మ ఆభరణాలను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది దాతల సహకారంతో కొత్తగా ఆభరణాలు తయారుచేయించినట్టు చెప్పారు. ఈ నెల 21, 22 తేదీల్లో నడివీధి గంగజాతర జరుగుతుందన్నారు. ఈ జాతరలో భాగంగా సేవా కార్యక్రమాలు, ఓం శక్తి భక్తుల విన్యాసాలు ఉంటాయన్నారు. నిర్వాహకులు సీకే క్రిష్టారెడ్డి, వెంకటేష్, గుణ పాల్గొన్నారు.

గంగమ్మ జాతర రేపు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం విరాటపురం రోడ్డు పక్కన ఉన్న గంగమ్మ ఆలయంలో మంగళవారం గంగమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆలయంలో అమ్మవారికి అంబలి పోసి ప్రసాదాలను నైవేద్యంగా సమర్పిస్తారని, అదేవిధంగా మంగళవారం అంగరంగ వైభవంగా అమ్మవారికి పూజలు నిర్వహించి ఊరేగింపు ఉంటుందన్నారు. జాతరకు సంబంధించి భారీ ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

23 నుంచి సబ్సిడీ విత్తనకాయల పంపిణీ

పెనుమూరు(కార్వేటినగరం): రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల పంపిణీ ప్రక్రియను ఈ నెల 23 నుంచి ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కల్యాణ్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ విత్తనకాయలు కావలసిన రైతులు స్వయంగా స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో పట్టాదారు పాసుపుస్తకం, 1బి, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో తప్పక రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విత్తన పంపిణీ ప్రక్రియ ఈ నెల 23 నుంచి రైతు భరోసా కేంద్రాల్లో ప్రారంభిస్తున్నట్లు సూచించారు.

కల్పవృక్షంపై కమలాకాంతుడు

గంగవరం: మండలంలోని కీలపట్లలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ కోనేటిరాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. నాలుగోరోజు ఆదివారం ఉదయం రుక్మిణీ, సత్యభామ సమేతంగా స్వామి కల్పవృక్షం, రాత్రి సర్వభూపాల వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. చెక్క భజనలు, కోలాట ప్రదర్శనలు, భక్తులు గోవింద నామ స్మరణల నడు మ వాహనసేవలు నయనానందకరంగా సాగాయి. ఉదయం ఆలయం నిత్య కైంకర్యాల అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. 9గంటలకు రుక్మిణి, సత్యభామా సమేతంగా స్వామివారిని రాజమన్నార్ అలంకరణలో కల్పవృక్ష వాహనంపై కొలువుదీర్చి ధీప దూప నైవేద్యాలు సమర్పించారు.

ఊపందుకున్న ఉపాధి పనులు



దిగువ తడకరలో కందకాలు తవ్వుతున్న కూలీలు

- పెరిగిన కూలీల వేతనాలు

తవణంపల్లె: ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులు ఊపందుకున్నాయి. ప్రభుత్వం వేసవిలో కూలీల వేతనాలు పెంచడంతో పనులు చేసేందుకు ఉత్సాహంగా ముందుకొస్తున్నారు. మండలంలో ఉపాధి హామీ పథకం కింద 32 పంచాయతీల్లో 4,600 జాబ్‌కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం మండలంలో సప్లై చానల్లో పూడికతీత పనులు, భూగర్భజలాలు పెంపొందించడానికి వీలుగా గుట్టల్లో కందకాలు, ఫిష్‌పాండ్ తవ్వుతున్నారు. మండలంలో 1,100 మంది ఉపాధి పనులు చేపడుతున్నారు. కూలీలకు గతంలో రూ. 272 వేతనాలు చెల్లించారు. ప్రస్తుతం కూలీలకు ప్రభుత్వం రూ.300 వేతనాలు పెంచింది. కూలీలకు వారినికి ఒక్కసారి వేతనలు వారి బ్యాంకు ఖాతాల్లోకి జమచేస్తున్నారు. ఎన్నికల వేళ కూలీలకు వేతనాలు సక్రమంగా మంజూరు కాలేదని ఒక వైపు భయాందోళన చెందారు. కానీ కూలీలకు సకాలంలో వేతనాలు అందించడానికి అధికారులు చర్యలు తీసుకొని మంజూరు చేస్తున్నారు. దీనితో కూలీలు సంతృప్తిగా పనులు చేస్తున్నారు. దీనిపై ఏపీఓ లలిత మాట్లాడుతూ పనులు పూర్తి చేసిన కూలీలకు వెంటనే బిల్లులు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మండలంలో ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెరిగిందని వివరించారు. వడదెబ్బకు గురికాకుండా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కూలీలు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పనులు చేయాలని సూచించారు.



దిగువమోదలపల్లెలో పూడికతీత పనులు

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ర్యాలీలో అధికారులు, విద్యార్థులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఎయిడ్స్ రహిత సమజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ పిలుపునిచ్చారు. ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరంలో ఆదివారం కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు సాగింది. అక్కడ మానవ హారం ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా మే మూడో ఆదివారం ఎయిడ్స్‌తో మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్టు చెప్పారు. హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష చూపరాదన్నారు. ఎయిడ్స్ రహిత బలమైన సమాజం నిర్మించేందుకు కృషి చేయాలని, హెచ్‌ఐవీ బాధితులకు ప్రేమ పంచాలని, వారికి సంఘీభావం ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు రవి, జాన్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రదోష పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ప్రదోషకాల పూజలు జరుగుతాయని ఆలయ అర్చకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శివుడికి నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహిస్తారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేపట్టనున్నారు. ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేస్తారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేపట్టనున్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు యోగా శిక్షణ



యోగా శిక్షణలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్: నిత్యజీవితంలో ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ యోగా చేయాలని 35 ఆంధ్రా బెటాలియన్ క్యాంపు కమాండెంట్ మేజర్ లోకనాథన్ తెలిపారు. పోలీసు పరేడ్ మైదానంలో ఆదివారం ఎన్‌సీసీ విద్యార్థులకు రెండవ రోజు క్యాంపు నిర్వహించి యోగాలో శిక్షణ ఇచ్చారు. కమాండెంట్ మాట్లాడుతూ నిత్యజీవితంలో ప్రతి వ్యక్తికీ యోగా తప్పనిసరిగా మేలు చేస్తుందన్నారు. క్యాడెట్లు క్రమం తప్పకుండా యోగా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. యోగా వల్ల మానసిక వికాసంతోపాటు ఒత్తిడిని జయించవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న అగ్నివీర్‌లో ఉద్యోగ అవకాశాలను తెలియజేశారు. అగ్నివీర్‌లో చేరడం వల్ల దేశానికి సేవ చేసే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, రమేష్, గిరిధర్‌నాయక్ పాల్గొన్నారు.

సాంకేతికతతో మనుషుల్లో కనిపించని మానవత్వం

చిత్తూరు రూరల్(కాణిపాకం): సాంకేతికత విస్తరించడంతో మనుషులు మానవత్వం మరిచిపోతున్నారని ఉపన్యాసకులు శాంతా భాస్కర్ తెలిపారు. చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం చైతన్య సాహితి, హరివిల్లు, లలిత కళావేదిక ఆధ్వర్యంలో చదివే సువర్చల, చదివే రాజారెడ్డి స్మారకోపన్యాసం నిర్వహించారు. భాగవతంలో స్తుతులు అనే అంశంపై ఆమె ప్రవచనం వినిపించారు. పూర్వం రచ్చబండల వద్ద భాగవతం, రామాయణం వంటి వాటిపై కథలు చెప్పుకునే వారని పేర్కొన్నారు. ప్రస్తుత రోజుల్లో సాంకేతిక విస్తరించడంతో రచ్చబండల వద్ద జనం కరువతున్నారన్నారు. టీవీలు, మొబైల్ ఫోన్లతోనే కాలం గడుపుతున్నారని పేర్కొన్నారు. మళ్లీ భాగవతంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కవులు బురుజు మునస్వామి, శ్యామలాదేవి, రాధాకృష్ణారెడ్డి, సుజాత, నాగిరెడ్డి, భాస్కరరెడ్డి, జయరామరెడ్డి, హరినాయుడు, రాజరత్నంరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాంతా భాస్కర్

హెచ్‌ఐవీ మృతులకు నివాళి

బంగారుపాళెం: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం హెచ్‌ఐవీ మృతులకు ఆత్మశాంతి కలగాలని వైద్యసిబ్బంది క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జ్ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ విజయకుమారి మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితులు ఎవ్వరూ అధైర్య పడవద్దని సూచించారు. ఏఆర్‌టీ మందులను క్రమం తప్పకుండా వాడితే జీవిత కాలాన్ని సాగించవచ్చన్నారు. భవిష్యత్తులో ఎవ్వరూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌తో మరణించకూడదని ప్రభుత్వం బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తోందన్నారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. హెచ్‌ఐవీ బాధితుల్లో మనోధైర్యాన్ని కల్పించేందుకు సైకాలజిస్టులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. డీపీఎం మణి, ఐసీటీసీ కౌన్సిలర్ బాబు, స్టాఫ్‌నర్సులు మంజూమాథ్యూ, రిజ్వానా, ఆశా కార్యకర్తలు భువనేశ్వరి, ద్రాక్షాయణి, జబీనా పాల్గొన్నారు.



హెచ్‌ఐవి మృతులకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

శరవేగంగా బోయకొండ అభివృద్ధి పనులు



పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆదివారం పనులను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి పరిశీలించి పలు సూచనలు చేశారు. దేవస్థానం కార్యాలయ భవన మరమ్మతు పనులను పరిశీలించి, ప్రమాదాలు సభవించినప్పుడు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఉండేలా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం లడ్డూ పోటును సందర్శించారు. నాణ్యతతో కూడిన ప్రసాదాలు తయారు చేసేలా చర్యలు తీసుకున్నట్లు చైర్మన్ వివరించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. పెద్దబోగం, చిన్నబోగం వద్ద పరిశుభ్రతను పాటించాలని సిబ్బందికి సూచించారు. రద్దీ ఎక్కువగా ఉన్నా సులభతరంగా భక్తులు అమ్మవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు సురేంద్రరెడ్డి, గంగిరెడ్డి, డిష్ సూరి తదితరులు పాల్గొన్నారు.



లడ్డూ పోటును పరిశీలిస్తున్న పెద్దిరెడ్డి, చైర్మన్ నాగరాజారెడ్డి

ఆకట్టుకున్న దుర్యోధన వధ



దుర్యోధన వధను తిలకించడానికి వచ్చిన జనసందోహం



దుర్యోధన వధ ఘట్టంలో భీమసేనుడు, దుర్యోధన వేషధారులు

పాలసముద్రం: మండలంలోని గంగమాంబపురం, ఆముదాల గ్రామాల్లో ధర్మరాజులస్వామి మహాభారత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం జరిగిన భీమ, దుర్యోధనుడి యుద్ధ సన్నివేశం ఆద్యంతం ఆకట్టుకుంది. వేణుగోపాల నాట్యబృందంలో భీమసేనుడిగా గోవిందరాజు, దుర్యోధనుడిగా భాస్కర్‌రెడ్డి కురుక్షేత్ర యుద్ధం ముగింపు సన్నివేశం ఆకట్టుకుంది. సర్వం కోల్పోయిన దుర్యోధనుడు అస్త్రసన్యాసం చేసి గంగలో తపస్సుకు వెళ్లగా, భీమసేనుడు రెచ్చగొట్టి యుద్ధానికి ప్రేరేపించే సన్నివేశం ఆద్యంతం ప్రజలను ఆకట్టుకుంది. దుర్యోధనున్ని వధించే సన్నివేశాన్ని తిలకించడానికి మండల పరిధిలోని ప్రజలతో పాటు తమిళనాడు ప్రజలు వందలాదికి పైగా తరలివచ్చారు. మహాభాతర ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో సందడి నెలకొంది.